క్లుప్తంగా

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

శాంతిపురం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన మెగా ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో 576 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. వీరిలో 118 మందికి క్యాటరాక్ట్ శస్త్రచికిత్స చేసుకోవాలని, 353 మందికి కళ్లజోడు ధరించాలని చిత్తూరు అపోలో ఆస్పత్రి వైద్యులు నిర్ధారించారు. శిబిరం ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీఎస్ మునిరత్నం, కడా పీడీ వికాస్ మర్మత్, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ హరినాథరెడ్డి, డాక్టర్లు వంశీకృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

తులసినాథంనాయుడుకు గిడుగు పురస్కారం



గంగవరం: తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసినాథంనాయుడు గిడుగు సాహిత్య పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు నిర్వాహకులు కళారత్న బిక్కిక్రిష్ణ ఆయనకు ఆహ్వానం పంపినట్టు తెలిపారు. ఈనెల 29న విజయవాడలో తెలుగుభాషా దినోత్సవం రోజున జరిగే గిడుగు జయంతి వేడుకల్లో ప్రముఖుల చేత పురస్కారాన్ని అందుకోనున్నట్టు తెలిపారు.

టపాసులు స్వాధీనం

గంగవరం: గోడౌన్‌లో టపాసుల అక్రమ నిల్వలపై గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్ శనివారం దాడులు నిర్వహించారు. గంగవరం ఫ్లైఓవర్‌కు కాస్త దూరంలోని గోడౌన్‌లో నిల్వచేసిన టపాసులను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. సీజ్ చేసిన పేలుడు పదార్థాలను స్టేషన్‌కు తరలించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



నిందితుని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పెద్దపంజాణి: కర్ణాటక నుంచి అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్‌ఐ సహదేవి తెలిపారు. శనివారం ఎస్‌ఐ తన సిబ్బందితో కలసి చీమనపల్లి వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో పుంగనూరు మున్సిపాలిటీకి చెందిన నిషార్ అహ్మద్ ఆటోలో కర్ణాటక మద్యాన్ని తీసుకొస్తుండగా పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 50 కర్ణాటక మద్యం ప్యాకెట్లు, ఆటోను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండుకు పంపినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాల్య వివాహాలపై అవగాహన

గుడిపాల: బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని నరహరిపేట హైస్కూల్లో శనివారం రీల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కార్యదర్శి రామారావు విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాలకార్మికుల చట్ట ప్రకారం బాలలు ఉండాల్సింది బడుల్లో మాత్రమేనని చెప్పారు. అంతే కానీ పనుల్లో, పొలంలో బాలలు కనిపించకూడదన్నారు. బాల్యవివాహాలను చేసుకోకూడదని వారికి దానిపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వారికి పలు సూచనలు చేశారు. అనంతరం గుడిపాల క్రాస్‌లో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఆయనతో పాటు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ జగదీష్, చైల్డ్‌రైట్స్ ప్రాజెక్ట్ మేనేజర్ హనీషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

పుంగనూరు: పట్టణంలోని రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమీలో శనివారం ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ చంద్రమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులను కృష్ణుడు, గోపికల వేషధారణలో అలంకరించారు. నృత్యాలు, గీతాలాపనతో పిల్లలు అలరించారు. టీచర్లు రజని, రెడ్డమ్మ, సౌమ్య, మునిరత్నం, జలజ, ఏసునాథ్, వనజ, సత్య, మహేష్, గౌతమి, షాహీన, బిందు, అఖిల్ పాల్గొన్నారు.

వరసిద్ధునికి రూ.6 లక్షల విరాళం

కాణిపాకం: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలోని నిత్యాన్నదానానికి శనివారం ఓ దాత నగదు విరాళం చేశారు. బెంగళూరుకు చెందిన దాత పి.బాబు రూ.5 లక్షల నగదును ఆలయ ఈఓ కె.వాణికి అందజేశారు. మరో దాత దాత మండుటి సునీల్ కుమార్ రూ.లక్షల చెక్కును అందజేశారు. దాతల కుటుంబ సభ్యులకు అధికారులు స్వామివారి దర్శనార్థం కల్పించారు.



దాడులతో సమాజానికే నష్టం



ప్రజల ఆరోగ్యం కోసం పరితపించే వైద్యులు, సిబ్బందిపై దాడితో సమాజానికి తీవ్ర నష్టం జరుగుతుంది. ఇలాంటి దాడులతో వైద్యులు రాత్రి, పగలు సేవలు అందించేందుకు వెనుకడుగు వేస్తారు. ఫలితంగా నిజమైన రోగులకు కూడా వైద్యసేవలు దూరమవుతాయి. ప్రభుత్వం వైద్యులకు రక్షణ కల్పించాలి. డాక్టర్లపై ఎలాంటి దాడులు జరిగినా కఠిన శిక్షలు అమలుచేయాలి.

–డాక్టర్ లక్ష్మీసంగీత, గైనకాలజిస్ట్, తేజ ఆస్పత్రి, పుంగనూరు

భరోసా కల్పించాలి..



కోల్‌కతా సంఘటన బాధాకరం. వైద్య వృత్తిలోని వారిపై అఘాయిత్యాలు క్షమించరాని నేరం. ఇక్కడ పీహెచ్‌సీ గ్రామానికి కొంతదూరంలో ఉంది. ప్రస్తుతం నైట్ వాచ్‌మన్ ఒక్కరే ఉన్నారు. రెండు షిఫ్టుల్లోనూ వాచ్‌మన్, సెక్యూరిటీ సిబ్బంది ఉండేలా చూడాలి. ప్రభుత్వం భరోసా కల్పిస్తే ఎటువంటి సమస్య లేకుండా విధులు నిర్వహిస్తాం.

–డాక్టర్ గిరీషా, చెరుకువారిపల్లె పీహెచ్‌సీ, సదుం

వైద్యులకు రక్షణ కల్పించాలి..



ఎంతో పవిత్రమైన వైద్య వృత్తిని ఎంచుకున్న యువతిని అత్యంత పాశవికంగా హత్య చేయడం దుర్మార్గం. అన్ని ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్యులకు, సిబ్బందికి రక్షణ కల్పించాలి. పట్టణం, నగరాల్లో పనిచేసే వైద్యులకే రక్షణ లేకపోతే గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే వైద్యుల పరిస్థితి ఏమిటి. మహిళా డాక్టర్లు ఆస్పత్రుల్లో విధులు నిర్వహించాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. వైద్యులకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

–డా.సుభాష్‌రాజ్, పీహెచ్‌సీ, ఎన్ కొత్తపల్లి, కుప్పం

కొంటే.. కొరివే

- కొనద్దంటున్న అధికారులు
- అనుమతులు పాటించని సైట్లకు రిజిస్ట్రేషన్లు
- కొన్న సైట్లకు మౌలిక సదుపాయాలు చేయమన్న మున్సిపల్ అధికారులు
- అప్రూవల్ అయ్యిందంటూ ఏమార్చుతున్న దళారులు
- కొండెక్కనున్న రియల్ వ్యాపారాలు



పలమనేరు సమీపంలో లేఔట్ వద్ద అక్రమ లేఔట్ అంటూ హెచ్చరిక బోర్డును నాటిన అధికారులు

పలమనేరు: మున్సిపల్ అధికారుల హెచ్చరికలతో ఇప్పటికే అక్రమ లేఔట్లలో స్థలాలు కొన్నవారిపై పిడుగు పడినట్టయింది. నిబంధనలు పాటించని లేఔట్లలో స్థలాలు కొన్నప్పటికీ భవిష్యత్తులో అక్కడ ఎలాంటి మౌలిక సదుపాయాలు చేపట్టేది లేదని మున్సిపల్ అధికారులు స్పష్టం చేశారు. లేఔట్‌కు సంబంధించిన అనుమతులు లేనప్పటికీ కొందరు రియల్ దళారుల మాటలు విని స్థలాలు కొన్నవారు ఇప్పుడు ఏం చేయాలో అర్థంగాని పరిస్థితి పలమనేరు నియోజకవర్గంలో నెలకొంది. ఇలాఉండగా డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారుల ఆదేశాలతో రియల్ వ్యాపారాలు పూర్తిగా స్తంభించడం గ్యారెంటీగా కనిపిస్తోంది. ఎందుకంటే నియోజకవర్గంలోని మొత్తం 180 దాకా లేఔట్లుండగా వీటిలో సంబంధిత పంచాయతీ లేదా మున్సిపాలిటీల నుంచి అనుమతులు పొందిన లేఔట్లు కేవలం పది మాత్రమే ఉన్నాయి. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాలతో రంగంలోకి దిగిన అధికారులు అక్రమ లేఔట్ల వద్ద హెచ్చరిక బోర్డులను నాటించారు. దీంతో వీటిల్లో ఇళ్ల స్థలాలు కొన్న వారికి కంటి మీద కునుకు లేకుండాపోయింది.

లేఔట్ నిబంధనలు ఇలా..

ఎవరైనా లేఔట్ వేయాలంటే వ్యవసాయభూమిని(గ్రీన్‌బెల్ట్) వ్యవసాయేతరభూమి (ఎల్లోబెల్ట్)గా మార్చుకోవాలి. ఆపై గ్రామాల్లో అయితే పంచాయతీ, రెవెన్యూశాఖల ద్వారా డిస్ట్రిక్ టౌన్ కంట్రీ ఆఫీసర్ ద్వారా, పట్టణాల్లో అయితే మున్సిపాలిటీ ద్వారా డైరెక్టర్ ఆఫ్ టౌన్ కంట్రీ కంట్రీ ప్లానింగ్(గుంటూరు) ద్వారా అప్రూవల్స్ పొందాలి. అధీకృత ప్లాన్‌ఇంజినీర్ ద్వారా లేఔట్ స్కెచ్ వేయించాలి. ఆపై నిర్దేశించిన లేఔట్ విస్తీర్ణంలో 12.5 శాతం(రిజర్వు ఏరియా, కమ్యూనిటీ కోసం) గ్రామాల్లో పంచాయతీలకు, పట్టణాల్లో మున్సిపాలిటీలకు సంబంధిత అధికారి పేరిట రిజిస్ట్రేషన్ చేయించి అప్పగించాలి. లేదా ఆస్థలం మార్కెట్ విలువలో 10 నుంచి 12శాతం నగదును చెల్లించాలి. లేఔట్‌లో ప్రధాన వీధులు 35 నుంచి 40 అడుగులు వాటికి అప్రోచ్ రోడ్లు కచ్చితంగా ఉండాలి. లేఔట్‌లో నీటి సౌకర్యం, డ్రైన్లు, కరెంటులాంటి మౌలిక సదుపాయాలుండాలి. ఆపై గ్రీనరీలాంటివి కూడా ఏర్పాటు చేసుకోవచ్చు.

అయితే ఇప్పటిదాకా జరిగిందిలా..

పలమనేరు నియోజకవర్గంలో 180 దాకా లేఔట్లున్నాయి. వీటిలో 80 శాతం దాకా ఇప్పటికే అమ్మకాలు సాగాయి. ఇందులో 170 దాకా అప్రూవల్ లేనివే. ఇక గ్రామాల్లో అయితే వ్యవసాయ భూములుగానే ఉండి సైట్లను విక్రయించిన లేఔట్లున్నాయి. మరికొన్ని పంచాయతీ స్థాయిలో అనుమతులుండి ఆపై డీటీసీపీఓ అనుమతులు లేనివి ఉన్నాయి. గతంలో విక్రయించిన కొన్ని లేఔట్లలో కరెంటు, నీటి సౌకర్యం లేనివి వున్నాయి. కనీసం 10 నుంచి 20 అడుగుల రోడ్డు మాత్రమే ఉన్నవి కొన్ని ఉన్నాయి. భూముల రిజిస్ట్రేషన్ నిషేధంలో ఉన్న సైట్లున్నాయి. నిమ్నజాతి కండిషన్ భూములను సైతం లేఔట్ల చేసి అమ్మేశారు. ఇలాంటి స్థలాలను కొన్న వారు ఇప్పుడు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. లేఔట్‌లు వేసేటప్పుడే సంబంధిత మున్సిపాలిటీ, పంచాయతీలు తగు చర్యలు తీసుకోకపోవడమే ఈ అనర్థాలకు కారణమైందనే మాట గట్టిగా వినిపిస్తోంది. ఆదిలోనే వీటిని ఆపేసుంటే తాము కొనే వాళ్లమే కాదని కొనుగోలుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా ఇప్పటికే అక్రమ లేఔట్లలో స్థలాలు కొన్నవారికి లక్షలు వెచ్చిస్తేగాని ఇంటి నిర్మాణాలు చేయలేని పరిస్థితి నెలకొంది. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డిని వివరణ కోరగా ఇక్కడున్న 90శాతం లేఔట్లకు అప్రూవల్స్ లేవన్నారు. ఇక్కడ తాము ఎలాంటి మౌలిక సదుపాయాలను చేయబోమన్నారు. ఇప్పటికే స్థలాలు కొన్న వారు భారీగా జరిమానాలు చెల్లించి వారి ఇంటికి మాత్రమే అనుమతులు పొందాల్సి ఉంటుందని తెలిపారు. ఇదే విషయమై స్థానిక సబ్‌రిజిస్ట్రార్ పద్మశేఖర్‌రెడ్డిని వివరణ కోరగా అన్ని డాక్యుమెంట్లు కరెక్ట్‌గా ఉంటే తాము రిజిస్ట్రేషన్లు చేస్తున్నామన్నారు. లేఔట్‌కు అప్రూవల్ ఉందా లేదా అనే దానిపై మున్సిపాలిటీ వాళ్లు చూసుకోవాలన్నారు.

లేఔట్ అప్రూవల్స్ లేకున్నా క్రయ విక్రయాలు..

ఓ భూమిని నలుగురు భాగస్వాములుగా కొని కొంత బయానా చెల్లించి అగ్రిమెంట్‌తోనే భూమిని చదునుచేసి రాళ్లనాటి స్కెచ్ చేతబట్టి సైట్ల అమ్మకాలు సాగించేస్తున్నారు కొందరు లేఔట్ యజమానులు. ఇలాంటి నిబంధనలు పాటించని లేఔట్లను కొన్న వ్యక్తులు ఆపై ఇంటి నిర్మాణం చేసేందుకు పడరాని పాట్లు పడి మళ్లీ అధికంగా డబ్బులు ఖర్చుచేసి అనుమతులు పొందాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితిని గమనించిన గత ప్రభుత్వం లేఔట్ల విషయంలో పక్కాగా నిబంధనలు అమలుచేయాలని నిర్ణయించింది. ఆమేరకు అన్ని అనుమతులున్న లేఔట్ సైట్లను మాత్రమే క్రయవిక్రయాలు జరపాలంటూ సంబంధిత రిజిస్ట్రార్ కార్యాలయాలకు కమిషనర్ అండ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ నుంచి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దీనిపై కొందరు కోర్టులకెళ్లడంతో రిజిస్ట్రేషన్లకు, అనుమతులకు సంబంధం లేదని కోర్టు చెప్పింది. దీంతో మళ్లీ అనుమతులు లేని లేఔట్లలో సైట్ల రిజిస్ట్రేషన్లు సాగుతున్నాయి. కొనేముందు రియల్ దళారుల మాయమాటలను నమ్మి కొన్నాకగానీ అనుమతులు లేవనే విషయం బాధితులకు తెలియడం లేదు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షిద్దాం



కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, అధ్యాపకులు

పుంగనూరు: ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దామంటూ శుభారాం ట్రస్ట్ చైర్మన్ సాయి శ్రీనివాసమూర్తి, ప్రకాష్‌రావు కోరారు. శనివారం శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలసి మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ పర్యావరణం పరిరక్షణ కోసం ప్రతి ఇంటి వద్ద విరివిగా మొక్కలు పెంచాలన్నారు. చెట్లు వలన స్వచ్ఛమైన గాలి, వాతావరణంతోపాటు సమృద్ధిగా వర్షాలు కురుస్తాయన్నారు. మానవాలి మనుగడకు స్వచ్ఛమైన వాతావరణం ముఖ్యమన్నారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్, ఐక్యూ ఏసీ కో–ఆర్డినేటర్ అనిల్ కుమార్, అధ్యాపకులు ఆంజనేయరెడ్డి, సోమరాజు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై అవగాహన ర్యాలీ

రామకుప్పం: 2024–25 విద్యాసంవత్సరానికి గానూ ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా పది, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు పాఠశాల హెచ్ఎం సుజాత తెలిపారు. అదేవిధంగా మండల కేంద్రం రామకుప్పంలో శనివారం ఎంఈఓ నారాయణ ఆధ్వర్యంలో ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆసక్తి కలవారు ప్రవేశాల కోసం రామకుప్పం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సంప్రదించాలన్నారు. కో–ఆర్డినేటర్ విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్ల వితరణ

చౌడేపల్లె: మాజీ ఐఏఎస్ అధికారి ప్రిన్సిపల్ కార్యదర్శి మునివెంకటప్ప వర్ధంతిని పురస్కరించుకొని ఎస్సీబాలుర, బాలికల, బీసీ బాలుర వసతి గృహం విద్యార్థులు 300 మందికి ప్యాడ్లు పంపిణీ చేశారు. శనివారం వసతి గృహంలో మునివెంకటప్ప చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పరివర్తన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్‌కే యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ వెంకటరెడ్డి, ఐఎఫ్ఎస్ మాజీ అధికారిణి గౌతమి కలసి విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ చేశారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు యమలా సుదర్శనం, నేతలు బ్యాంకు రెడ్డప్ప, రవి, టీవీ రమణ, నరసింహులు, చంద్రయ్య, తాతయ్య, వార్డెన్లు సురేష్, దీపారాణి ఉన్నారు.



ప్యాడ్లను పంపిణీ చేస్తున్న నేతలు



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నిందితులను శిక్షించాలి

గంగవరం: కోల్‌కతాలో ట్రైనీ మహిళా వైద్యురాలిపై జరిగిన ఘాతుకానికి నిరసనగా పట్టణంలోని పాఠశాలలు, కళాశాల విద్యార్థులు శనివారం హ్యూమన్‌రైట్స్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ అత్యంత క్రూరంగా మహిళా వైద్యురాలిని అత్యాచారం చేసి ఆపై హత్య చేయడం చాలా దారుణమన్నారు. అలాంటి ఘాతుకానికి ఒడిగట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుని దేశంలోని మహిళా వైద్యులు, సిబ్బందికి రక్షణ కల్పించేలా చట్టాలు, కమిటీలు అమల్లోకి తీసుకురావాలని కోరారు.

స్వామివారి దర్శనాల నిలిపివేత



మూసిన ఆలయ తలుపులు

గంగవరం: మండలంలోని కీలపట్ల శ్రీ కోనేటిరాయ స్వామ ఆలయం ఒక రోజు మూత పడింది. గ్రామంలో స్వామివారి ఆలయానికి ఎదురుగా ఉన్న సన్నిధి వీధిలో ఓ ఇంట్లో వ్యక్తి మృతి చెందిన కారణంగా శుక్రవారం మధ్యాహ్నం నుంచి శనివారం మధ్యాహ్నం వరకు 24 గంటల పాటు స్వామివారి దర్శనాలను ఆలయ అధికారులు నిలిపేశారు. ఆ తరువాత ఆలయ శుద్ధి అనంతరం స్వామివారి దర్శనాలకు అనుమతిచ్చారు.

గెస్ట్ లెక్చరర్ కావలెను

చౌడేపల్లె: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లిషు సబ్జెక్ట్‌లో బోధన చేయడానికి గెస్ట్ లెక్చరర్ అవసరమని ప్రిన్సిపల్ జయప్రకాష్ ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. ఎంఏ ఇంగ్లిషు చదివి 50 శాతం కంటే ఎక్కువ మార్కులతో పాసైన వారు అర్హులన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 27వ తేదీ మంగళవారం కళాశాలలో నిర్వహించే డెమో క్లాసులకు హాజరుకావాలని ప్రకటనలో కోరారు.

రాయితీపై బిందుసేద్యం పరికరాలు

శాంతిపురం: ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న బిందు సేద్యం పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ కోరారు. జిల్లా ఉద్యానవన, వ్యవసాయ శాఖలు శనివారం మండల సచివాలయంలో నిర్వహించిన రైతుల అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం, ఇతర రైతులకు 70 శాతం రాయితీతో పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈసందర్భంగా బిందు, తుంపర సేద్యంపై రాయతీ వివరాలను తెలిపే వాల్ పోస్టర్లను అధికారులు ఆవిష్కరించారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసుదన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ, ఉద్యాన, వ్యవసాయ శాఖల డీడీలు కోటేశ్వరరావు, అన్నపూర్ణ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీఎస్ మునిరత్నం, నాయకులు విశ్వనాథరెడ్డి, సత్యేంద్రశేఖర్, విజయరామిరెడ్డి పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు, నేతలు

వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



కృష్ణాష్టమి వేడుకల్లో విద్యార్థులు

బైరెడ్డిపల్లె: మండలంలోని నెల్లిపట్ల ప్రాథమిక పాఠశాలలో శనివారం ముందస్తు శ్రీ కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు గోపిక, కృష్ణుడు వేషధారణతో అలరించారు. విద్యార్థులకు ఉట్టి కొట్టడం, ఆటలు, పాటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఎంఈఓ వేణుగోపాల్ రెడ్డి, హెచ్ఎం క్రిష్ణయ్య, ఉపాధ్యాయులు సురేఖ, శాంభవి, శివప్రసాద్, తేజోవతి పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

–వారం రోజులుగా ఇంట్లోనే మృతదేహం



సరస్వతమ్మ(ఫైల్)

గంగవరం: పలమనేరు పట్టణంలోని రంగాపురంలో నివసిస్తున్న సరస్వతమ్మ(50) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పట్టణంలోని రంగాపురం ఓ ప్రైవేట్ స్కూల్ ముందున్న ఓ ఇంట్లో సరస్వతమ్మ ఒంటరిగా నివసిస్తోంది. ఆమె గత వారం రోజులుగా ఇంట్లో నుంచి బయటకురాలేదు. వారం రోజుల తరువాత ఆ ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి వెళ్లి ఇంటి తలుపులు పగులగొట్టి పరిశీలించగా మహిళపై దుస్తులు లేకుండా మృతిచెంది ఉండడాన్ని గుర్తించారు. బాత్‌రూంలో స్నానం చేసుకుని ఇంట్లోకి వస్తుండగా కాలుజారి పడి మృతిచెంది ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఉపాధిలో రూ.4.45 లక్షల దుర్వినియోగం

- నలుగురు ఎఫ్ఏలు సస్పెన్షన్
- మామిడి మొక్కలు ధ్వంసం చేసిన రైతులకు నోటీసులు
- డ్వామా పీడీ రాజశేఖర్



బహిరంగ సభలో వివరాలు వెల్లడిస్తున్న పీడీ రాజశేఖర్

పెద్దపంజాణి: ఉపాధి హామీ పథకం అమల్లో భాగంగా గత వారం రోజులుగా నిర్వహించిన సామాజిక తనిఖీల్లో రూ.4.45 లక్షల నిధులు దుర్వినియోగం అయ్యాయని డ్వామా పీడీ రాజశేఖర్ తెలిపారు. శనివారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ బహిరంగ సభను నిర్వహించారు. మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో మండలంలో వివిధ శాఖల అనుసంధానంతో 1,258 పనులకుగాను రూ. 5.49 కోట్ల నిధులు ఖర్చుచేశామన్నారు. గ్రామస్థాయిలో నిర్వహించిన తనిఖీల్లో రూ.4.45 లక్షల నిధులు దుర్వినియోగం చేశారని సామాజిక తనిఖీ బృందం సభ్యులు గుర్తించారని వెల్లడించారు. పండ్ల తోటలపెంపకం పనుల్లో మామిడి మొక్కలు ధ్వంసం చేసిన రైతులకు నోటీసులు జారీచేయాలని ఏపీఓను పీడీ ఆదేశించారు. నిధుల దుర్వినియోగానికి బాధ్యులైన పెద్దవెలగటూరు, అప్పినపల్లె, రాయలపేట, కొళతూరు గ్రామపంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్లను సస్పెండ్ చేశామని పీడీ తెలిపారు. ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పిస్తామన్నారు. పండ్ల తోటల పెంపకం, భూగర్భజలాలను పెంచడంతోపాటు శాశ్వత ఆర్థిక వనరులు పొందే పనులు చేపట్టే అవకాశం ప్రభుత్వం కల్పించినట్లు చెప్పారు. అవకాశాన్ని రైతులు, కూలీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీవీఓ గంగాభవాని, ఎంపీడీఓ అబ్దుల్ రహీం, ఎస్ఆర్‌పీ మల్లికార్జున, డ్వామా ఏపీడీ రవికుమార్, ఏపీఓ చిన్నరెడ్డెమ్మ పాల్గొన్నారు.

స్మార్ట్ దెబ్బకు సినిమా కుదేలు



శిథిలావస్థలో ఉన్న లక్ష్మీ థియేటర్(ఫైల్)



ఆధునీకరించిన రంగమహల్



అపార్ట్‌మెంట్‌గా మారిన రామలక్ష్మణ

- కనుమరుగవుతున్న సినిమా హాళ్లు!
- పెనుభారంగా మారిన థియేటర్ల నిర్వహణ
- థియేటర్‌ల స్థానంలో కమర్షియల్ కాంప్లెక్స్‌లు, అపార్ట్‌మెంట్లు
- పలమనేరులో ఇప్పుడు మిగిలింది నాలుగు థియేటర్లే

పలమనేరు: పట్టణంలో ఎవరైనా ఎక్కడున్నావంటే తాను లక్ష్మీ టాకీస్ వద్ద అనో, రామలక్ష్మణా అనో చిరునామా చెప్పుకోవడానికి తప్పిస్తే అక్కడ ఇప్పుడు ఆ సినిమాహాళ్లు లేవు. గతంతో ఎంతో పేరుగాంచిన నాటి సినిమా హాళ్లు ఇప్పుడు జాడ లేకుండాపోయాయి. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో దూసుకొస్తున్న పలు రకాల సెట్ అప్ బాక్సులు, కేబుల్ నెట్‌వర్క్, స్మార్ట్ ఫోన్ల డిజిటల్ దెబ్బకు థియేటర్ల ఉనికి ప్రశ్నార్థకమైంది. కనీసం పెట్టిన డబ్బుకు సరిపడా ఆదాయం లభించకపోవడంతో పలు థియేటర్లు నష్టాలతో మూసివేతకు గురవుతున్నాయి. ఇప్పటికే ప్రేక్షకాదరణ కరువై థియేటర్లు అపార్ట్‌మెంట్లుగా, షాపింగ్ కాంప్లెక్స్‌లు, కల్యాణ మండపాలుగానూ రూపాంతరం చెందాయి. మరికొన్నింటిని ధ్వంసం చేసి ఇళ్ల స్థలాలకు అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికే అరాకొరగా ఉన్న థియేటర్ల మనుగడ భవిష్యత్తులో మరింత ప్రశ్నార్థకం కానుంది.

1951లో మోహన్ టూరింగ్ టాకీస్..

పలమనేరు పట్టణంలోనే మొట్టమొదటి టాకీ సినిమాను రుచి చూపించిన ఘనత మోహన్‌రెడ్డికే దక్కుతుంది. ఆయన అప్పట్లో మదనపల్లె రోడ్డు సమీపంలోని పెద్దచెరువు వద్ద ఓ టెంటును నిర్వహించేవారట. ఆ తర్వాత ఆయనే మోహన్ టూరింగ్ టాకీస్‌ను నడిపారు. ఈ తతంగమంతా 1951 ప్రాంతంలో జరిగింది. ఇదే పలమనేరు ప్రజలకు మొట్టమొదటి టూరింగ్ టాకీస్. అప్పట్లో మూడణాల నుంచి 30 పైసల దాకా టికెట్ వసూలు చేసేవారు. కాలక్రమేనా ఆ టికెట్ రూ.3 దాకా వచ్చింది. ఆ తర్వాత 1970వ దశకంలో గండికోట లక్ష్మయ్య, రామయ్యశెట్టి ఇక్కడ రామలక్ష్మణ అనే థియేటర్‌ను నిర్మించారు. తర్వాత తీర్థంకు చెందిన లక్ష్మీనారాయణశెట్టి లక్ష్మీ పిక్చర్ ప్యాలెస్‌ను నిర్మించారు. తర్వాత రంగ మహల్, వి.వి.మహల్, మంజునాథ, పద్మశ్రీ థియేటర్లు వెలిశాయి.

ఇప్పుడు వీటి పరిస్థితి..

లక్ష్మీథియేటర్‌ను ధ్వంసం చేశారు. అక్కడ మొండి గోడలు మాత్రం కనిపిస్తున్నాయి. ఇక రామలక్ష్మణ టాకీస్‌ను పడగొట్టి ప్రకృతి అపార్ట్‌మెంట్‌ను కట్టారు. రంగమహల్‌ను ఇటీవల ఆధునీకరించారు. మంజునాథ్, వీవీ మహల్, పద్మశ్రీ సినిమాహాళ్ల పరిస్థితి నష్టాలబాటలో ఉంది. ఇవి కూడా ఎన్నాళ్లుంటాయో తెలియని పరిస్థితి ఏర్పడింది. సినిమా హాళ్లనే నమ్ముకున్న ఆపరేటర్లు, సిబ్బంది, దుకాణదారులు కుటుంబాలు ఇతర పనులు చేసుకుంటున్నారు. సినిమాహాళ్లు పడగొట్టినా నాటి అనుభవాలు, అనుభూతులు మాత్రం జనం ఇప్పటికీ చెబుతూనే ఉంటారు.